ప్రజాశక్తి
శనివారం 26 ఏప్రిల్ 2025 5 విజయనగరం



నేడు యువ సమ్మేళనం

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 26న కియాయూత్ ట్రాన్స్‌ఫర్మేషన్ మిషన్, విజయనగరం చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యాన నగరంలోని సుజాత కన్వెన్షన్‌సెంటర్‌లో నిర్వహించే యువ సమ్మేళన కార్యక్రమాన్ని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమ సమన్వయ కర్తలు రవిచంద్ర రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు ఎం.రాము తెలిపారు. మాజీ డిఆర్‌డిఒ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ జి.సతీష్ రెడ్డి సాంకేతిక రంగం-రక్షణ రంగంలో యువత యొక్క పాత్ర అనే అంశంపై విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ నిర్వహిస్తారని తెలిపారు. ముఖ్యఅతిథిగా హజరత్ ఖాదర్ వాలి బాబా దర్గా అండ్ దర్బార్ షరీఫ్ డాక్టర్ ఎమ్‌డి ఖలీలుల్లా షరీఫ్, కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్ హాజరవుతారని తెలిపారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, మారిక గ్రామస్తులు

మారికలో అదానీని అడుగుపెట్టనివ్వం

సిపిఎం ఆధ్వర్యాన గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-వేపాడ

మారికలో అదానీ కంపెనీ అడుగు పెట్టకుండా అడ్డుకుంటామని గిరిజనులు హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని మారిక గ్రామంలో సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు చల్లా జగన్ మాట్లాడుతూ మారిక గ్రామాన్ని, భూములను, బడిని లేకుండా చేసి, మొత్తం కొండనే దోచుకొనేందుకు వస్తున్న అదానీకి చెందిన గుజరాత్ కంపెనీని అడ్డుకుంటామని చెప్పారు. మారిక రెవెన్యూలో 35 సర్వే నంబర్లు ఉంటే, మొత్తం 32 సర్వే నంబర్ల పరిధిలో ఉన్న భూములను హైడ్రో పవర్ ప్లాంట్‌కి అప్పగిస్తామని కలెక్టర్ ద్వారా నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అదానీపై ఉన్న శ్రద్ధ గిరిజనులపై లేకపోవడం దారుణమన్నారు. మారిక భూములను అదానీ కంపెనీకి అప్పగించే నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే జిల్లాలోని గిరిజనులను ఐక్యం చేసి, పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాబూరావు, ఆనంద్, రామకృష్ణ, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కేటాయింపు పెంచాలి

ఇఫ్కో చైర్మన్‌ను కోరిన బంగార్రాజు

ప్రజాశక్తి-భోగాపురం

రాష్ట్రానికి ఎక్కువ శాతం ఎరువులు కేటాయించాలని మార్క్‌ఫెడ్ చైర్మన్, ఇఫ్కో డైరెక్టర్ కర్రోతు బంగార్రాజు... ఇఫ్కో చైర్మన్ దిలీప్ సంఘానిని కోరారు. ఢిల్లీలోని ఇఫ్కో కార్యాలయంలో శుక్రవారం 595వ బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బంగార్రాజు పాల్గొన్నారు. అనంతరం ఆయన దిలీప్ సంఘానికి వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్లలో ఎరువుల కేటాయింపు తగ్గుతూ వస్తోందని వివరించారు. దీంతో రైతులకు సకాలంలో ఎరువులు అందక ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ఏడాది నుంచి ఎక్కువ శాతం ఎరువులు సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

ఇఫ్కో చైర్మన్‌కు వినతి అందజేస్తున్న బంగార్రాజు

ఇక ఎయిడెడ్ వంతు

40 మంది కంటే తక్కువ మంది విద్యార్థులున్న ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి మూతబడనున్నాయి. ప్రభుత్వం సూచనల మేరకు విద్యాశాఖ అధికారులు ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలో ఏడు ఎయిడెడ్ పాఠశాలలు మూతబడనున్నాయి. ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 40మంది లోపే ఉన్నారు. ఈ పాఠశాలలు మూతబడితే ఒకటవ తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పక్క గ్రామాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాని మూసివేస్తున్న పాఠశాలల స్థానంలో ప్రభుత్వ పాఠశాలలను మంజూరు చేయాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కాని ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి ఉత్తర్వులూ రాలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కొత్తచెరుకుపల్లిలోని సిబిఎం ఎయిడెడ్ పాఠశాల

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏడు ఎయిడెడ్ పాఠశాలలు మూత
- 40 మంది కంటే తక్కువ విద్యార్థులుంటే మూసేయాలని ఆదేశం
- ఇబ్బంది పడనున్న విద్యార్థులు
- ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయాలంటున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి- భోగాపురం

ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో 40 మంది విద్యార్థుల లోపు ఉంటే ఆ పాఠశాలలను మూసి వేయాలంటూ గత ప్రభుత్వం హయాంలో జీవో నెం.24 ను పాఠశాల విద్యాశాఖ జారీ చేసింది. అంతేకాక విద్యార్థులు సంఖ్య తక్కువగా ఉంటే పెంచుకోవాలని కూడా సూచించింది. కాని జిల్లాలో మాత్రం ప్రస్తుతం ఉన్న ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో 40మంది కంటే తక్కువ విద్యార్థులున్న పాఠశాలలు ఏడు ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ గుర్తించింది. ఈ మేరకు వీటిని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏకంగా మూసి వేయాలని నిర్ణయించారు. భోగాపురం మండలంలోని చెరుకుపల్లి, బొబ్బిలి మండలంలోని అలజంగి, మెరకముడిదాం మండలంలోని గర్భాం, నెల్లిమర్ల, రామభద్రపురం మండలంలోని ఆరికతోట, వంగర మండలంలోని మగ్గూరు, విజయనగరం పట్టణంలో ఎమ్.జి రోడ్డులో ఉగల యూపిఎస్ పాఠశాలలు ఉన్నాయి. ఇవన్నీ కూడా మూతబడనున్నాయి.

పక్కగ్రామాల్లో పాఠశాలలకు వెళ్ళాల్సిందే

ప్రస్తుతం మూడబడుతున్న ఈ పాఠశాలల్లోని విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రక్క గ్రామాల్లో గల పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకటవ తరగతి నుంచి ఐదు తరగతి చదువున్న విద్యార్థులంతా ఇబ్బంది పడాల్సి వస్తుంది. కానీ ఎత్తివేస్తున్న పాఠశాలల స్థానంలో ప్రభుత్వం మాత్రం ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటుకు ఎటువంటి ఉత్తర్వులూ ఇవ్వలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఉదాహరణకు భోగాపురం మండలంలోని చెరుకుపల్లి పాఠశాలలో సుమారు 22 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం వీరంతా వేరే గ్రామంలోని పాఠశాలకు వెళ్ళాలంటే సుమారు 3కిలో మీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అందుకు ప్రభుత్వంతో పాటు ప్రజాప్రతినిధులు స్పందించి ఎత్తివేసిన పాఠశాలల స్థానంలో ప్రభుత్వ పాఠశాలను మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆదేశాలు వచ్చాయి

40 మంది కంటే తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి మూసివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీనిలో భాగంగా చెరుకుపల్లి పాఠశాల మూతబడనుంది. ఇక్కడ చదువుతున్న విద్యార్థులు వేరే పాఠశాలలకు వెళ్లి చదువుకోవాలి.

- బి. చంద్రమౌళి, ఎంఇఒ, భోగాపురం

విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు, డెంకాడలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే లోకం మాధవి, టిడిపి, జనసేన నాయకులు

ఉగ్ర దాడిపై నిరసనలు

నగరంలో ముస్లిం సమాఖ్య ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ లో జరిగిన ఉగ్రవాద దాడికి నిరసనగా నూరుల్ ముస్తఫా మస్జిద్ (చోటి మస్జిద్) ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. మసీద్ ప్రాంగణం నుండి అంబటి సత్రం, మూడు లాంతర్లు, గంటస్తంభం వరకు ర్యాలీ చేపట్టారు. ముడులాంతర్ల వద్ద జామియా మసీద్ కమిటీ ఆధ్వర్యాన ప్ల కార్డులతో నిరసన తెలిపారు. అనంతరం. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ మృతులకు నివాళులు అర్పించారు.

బొబ్బిలి : పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి ముస్లిములు నివాళులర్పించారు. పట్టణంలో జామియా మసీదులో శుక్రవారం ప్రత్యేక ప్రార్ధనల అనంతరం సంతాప సూచకంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం విశాఖ డెయిరీ సెంటర్లో మానవహారంగా ఏర్పడి భారతదేశానికి అనుకూలంగా నినాదాలు చేశారు.

టూరిస్టులపై ఉగ్రవాదులు దాడి హేయమైన చర్య అని జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి, గ్రీన్ బెల్ట్ సొసైటి అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆర్.కిరణ్ కుమార్, అలజంగి సిబిఎం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.కష్ణదాసు అన్నారు. ఉగ్రదాడికి వ్యతిరేకంగా పట్టణంలో శుక్రవారం ఆర్టీసి కాంప్లెక్స్, ఎన్టీఆర్ బొమ్మ, టిఆర్ కాలనీలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నివారించాలని డిమాండ్ చేశారు.

ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ జెసి రాజు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కారుణ్య ఫౌండేషన్ సభ్యులు యుగంధర్, సోమేష్, దుర్గ ప్రసాద్, చంద్ర శేఖర్, సంధ్య ,గీత తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : ఉగ్ర దాడికి వ్యతిరేకంగా ఎమ్మెల్యే లోకం మాధవి ఆధ్వర్యాన కూటమి నాయకులు డెంకాడలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ నాయకులు కంది చంద్రశేఖర్‌రావు, మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, నాయకులు కలిదిండి పాణిరాజు, తదితరులు పాల్గొఆన్నరు.

శృంగవరపుకోట : ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు, హమాలీలు శుక్రవారం పట్టణంలో దేవి కూడలి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కె.భీముడు, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిపై న్యాయవాదుల నిరసన

విజయనగరం లీగల్ : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులపై చేసిన దాడిని ఖండిస్తూ విజయనగరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు శుక్రవారం నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె రవిబాబు, కార్యదర్శి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలిశెట్టి రవిబాబు మాట్లాడుతూ పహల్గాం లో ఆహ్లాదకరమైన ప్రదేశంలో పాశవికంగా ఉగ్రవాదులు చేసిన ఉన్మాదదాడి లో అమాయక ప్రజలు చనిపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలను విజయనగరం బార్ అసోసియేషన్ సంతాపం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్. సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలి

వినూత్న ఆలోచనలు చేయండి : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-రాజాం, చీపురుపల్లి

జిల్లాలో 15 శాతం వృద్ధిరేటు సాధించేందుకు అనుగుణంగా గ్రామస్థాయి ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. వినూత్నంగా, విభిన్నంగా ఆలోచించి ఈ ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించడం ద్వారా ఇతర జిల్లాలకు మనం ఆదర్శంగా నిలవాలని కోరారు. ఏప్రిల్ నెలాఖరులోగా ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని రాజాం, చీపురుపల్లిలో శుక్రవారం నిర్వహించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.బాలాజీ ముందుగా మాట్లాడుతూ జిడిపి, జివిఎలను లెక్కించే విధానాన్ని, మూడు ప్రధాన రంగాల గురించి వివరించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, జిల్లా తలసరి ఆదాయాన్ని పెంచే మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. మన జిల్లా పరిస్థితులను బట్టి ప్రాథమిక రంగంలోనే ఎక్కువ అభివృద్ధి సాధించే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూమి జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాలు వరకు అందుబాటులో ఉందని, కానీ ప్రస్తుతం లక్షా,80 వేల ఎకరాలు మాత్రమే సాగు అవుతోందని, మిగిలిన భూమిని దశలవారీగా సాగులోకి తీసుకురావాలని సూచించారు. వివిధ రకాల పంటలు, అంతర్ పంటలను సాగు చేయాలని చెప్పారు. రబీలో సాగును పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. గుడ్లు, పాలు, మాంసం ఉత్పత్తిని ఎగుమతి చేసే స్థాయికి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో ప్రతి మండలంలో ఒక పౌల్ట్రీ ఫారాన్ని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి, మాంసం, గుడ్ల ఉత్పత్తిని పెంచడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న చెరువుల్లో చేపల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. సేవా రంగం అభివద్ధిలో కూడా జిల్లాలో విస్తత అవకాశాలు ఉన్నాయని, తెలిపారు. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం కూడా వద్ధికి అవకాశం ఉందన్నారు. గ్రామ స్థాయి పరిస్థితులను, వనరులను పూర్తిగా అధ్యయనం చేసి, వాటికి తగ్గట్టుగా గ్రామ స్థాయి ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు.

వ్యవసాయశాఖ జెడి వి.టి.రామారావు, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ వైవి రమణ, ఉద్యానశాఖ డిడి ఎవిఎస్‌వి జమదగ్ని, ఎపిఎంఐపి పీడీ పిఎన్‌వి లక్ష్మీ నారాయణ తమ శాఖా పరమైన అంశాలను, సాధించాల్సిన లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రకతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ను కలెక్టర్ తిలకించి, రైతులకు నవధాన్యాల కిట్లను అందజేశారు. సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారులు రాజేశ్వరి, ఆసయ్య, ఆర్‌డిఒ సత్యవాణి, ప్రకృతి వ్యవసాయం డిపిఎం ఆనందరావు, ఎడిఎ కోటేశ్వరరావు, చీపురుపల్లి ఎంపిడిఒ సురేష్, తహశీల్దార్ ఎన్.రాజారావు, నాలుగు మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వితంతువులకు పింఛను అవకాశం

ప్రజాశక్తి-విజయనగరం కోట

వితంతువులు పింఛన్లు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం సదావకాశం కల్పిస్తోందని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛనుదారుడు చనిపోతే వెంటనే అతని భార్యకు వితంతు పింఛను మంజూరు అయ్యేలా ప్రభుత్వం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. దీనివల్ల 89,788 మంది లబ్ధి పొందుతారని తెలిపారు. మే 1 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 50 ఎంఎస్‌ఎంఇ పార్కులను ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఇఒ మాణిక్యంనాయుడు

ప్రశాంతంగా ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపిఆర్‌జెసి, ఎపిఆర్‌ఎస్‌సిఎటి ప్రవేశ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయని డిఇఒ యు.మాణిక్యం నాయుడు తెలిపారు. ఎపిఆర్‌ఎస్‌సిఎటి పరీక్షకు 1288 మంది హాజరు కావాల్సి ఉండగా 1064 మంది హాజరయ్యారు. ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షకు 2104 మందికి గాను 1891 మంది హాజరయ్యారు. 213 మంది గైర్హాజరయ్యారు. ఎపిఆర్‌డిసి డిగ్రీ ప్రవేశ పరీక్షకు 77 మందికి గాను 65 మంది హాజరయ్యారు.

జిందాల్ యాజమాన్యం తీరు సరికాదు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ పరిశ్రమ యాజమాన్యం తీరు సరైనది కాదని, పరిశ్రమను నమ్ముకొని జీవిస్తున్న కార్మికులను రోడ్డున పడేశారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న జిందాల్ పరిశ్రమ గేటు ముందు సిఐటియు, టిఎన్‌టియుసి, వైఎస్‌ఆర్‌టియుసి ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జిందాల్ యాజమాన్యం పరిశ్రమల చట్టానికి వ్యతిరేకంగా లాకౌట్ ప్రకటించిందన్నారు. యాజమాన్యం కష్టనష్టాలను కార్మికులకు తెలియజేసి, పరిశ్రమను నమ్ముకున్న కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేసి, చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. కార్మికుల రెక్కల కష్టంపై కోట్లాది రూపాయలు సంపాదించుకున్న యాజమాన్యం, లాకౌట్ కాలమంతా వేతనం చెల్లించేందుకు అంగీకరించి నోటీస్ బోర్డులో పెట్టాలని డిమాండ్ చేశారు. జిందాల్ పరిశ్రమ నిర్మాణానికి రైతులంతా స్వచ్ఛందంగా వచ్చి భూములు ఇచ్చి, పరిశ్రమ నిర్మాణానికి సహకరించారని గుర్తుచేశారు. అటువంటి రైతులు, కార్మిక వర్గానికి యాజమాన్యం అన్యాయం చేయడం, వారి ఉపాధికి గండి కొట్టడం సరైనది కాదన్నారు. యాజమాన్యం తప్పించుకునేందుకు డొంక తిరుగుడు మాటలు చెబుతుందని మండిపడ్డారు. మెటీరియల్ ధర పెరిగిపోయిందని, విద్యుత్ ఛార్జీలు పెరిగాయని, వీటి కారణంగా లాకౌట్ తప్పించుకోవాలని చూస్తే ఇక్కడ కార్మిక వర్గం ఊరుకోదని హెచ్చరించారు. యాజమాన్యం ఇక్కడున్న ఖరీదైన భూమిని ప్లాట్లు వేసి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసుకోవాలనే కుట్ర తప్ప మరొకటి కాదని స్పష్టంచేశారు. ఇప్పటికైనా యాజమాన్యం ద్వంద్వ వైఖరి విడనాడి, లాకౌట్ ఎత్తివేసి పరిశ్రమను యథావిధిగా నడిపించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు, సిఐటియు నాయకులు నమ్మి చిన్నబాబు, టిఎన్‌టియుసి నాయకులు భీమన్న, సన్యాసి, బి.అప్పారావు, జిందాల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఎన్.ఆదినారాయణ, వైఎస్‌ఆర్‌టియుసి నాయకులు లగుడు వామాలు, తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ పరిశ్రమ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

భోగాపురంలో రూ.50 లక్షలతో పోస్టల్ కార్యాలయం

ప్రజాశక్తి-భోగాపురం

విమానాశ్రయానికి అనుసంధానంగా భోగాపురంలో 50 లక్షల రూపాయలతో పోస్టల్ కార్యాలయాన్ని నిర్మించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాశ్ తెలిపారు. పోస్టల్ కార్యాలయానికి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంజూరు చేసిన భూమిని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం విమానాశ్రయ నిర్మాణ ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. కొత్తగా భోగాపురంలో నిర్మించనున్న పోస్టల్ కార్యాలయానికి, విమానాశ్రయానికి రాకపోకలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో స్పీడ్ పోస్ట్ సేవలు విమానాశ్రయం ద్వారా ఇతర దేశాలతో పాటు రాష్ట్రాలకు ఇక్కడి నుంచి అందించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక పోస్టల్ కార్యాలయానికి వెళ్లి అక్కడ సిబ్బందితో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు శ్రీనివాసరావు, ఎఎస్‌పిలు మధు, సుందరనాయుడు, పోస్టుమాస్టర్ పప్పల శ్రీనివాసు, ఎపిఎం జి.రవి పాల్గొన్నారు.

విమానాశ్రయం వద్ద జిఎంఆర్ సిబ్బందితో మాట్లాడుతున్న కె.ప్రకాశ్

బీరు ఫ్యాక్టరీగా మార్చే ఆలోచన లేదు

సంకిలి సుగర్స్ యాజమాన్యం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సంకలి సుగర్ ఫ్యాక్టరీని బీర్ ఫ్యాక్టరీగా మార్చాలనే ఆలోచనగానీ, అవకాశంగానీ లేదని ఆ ఫ్యాక్టరీ యాజమాన్యం (డిఐ ప్యారీ (ఇండియా) లిమిటెడ్) కార్యదర్శి స్పష్టం చేశారు. లాకౌట్ దిశగా ఆలోచన కూడా లేదన్నారు. ఈనెల 4, 16వ తేదీల్లో ' లాకౌట్ దిశగా సంకిలి ప్యారీ సుగర్స్, సంకిలి ప్యారీలో... షుగర్ పరిశ్రమా!.. బీర్ ఫ్యాక్టరీయా? అనే శీర్షికలతో ప్రజాశక్తిలో కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. దీనిపై యాజమాన్యం ఒక ప్రకటనలో స్పందించింది. తమ ఫ్యాక్టరీని బీరు తయారీ పరిశ్రమగా మార్చబోమని, ఆ ప్రచారంలో వాస్తవం లేదని తెలిపారు. ఇథనాల్ ఉత్పత్తి అనేది దేశవ్యాప్తంగా ఉన్న చక్కెర మిల్లులలో ఒక సాధారణ అనుబంధ కార్యక్రమమేనని తెలిపారు. బీరు తయారీకి ఎటువంటి సంబంధమూ లేదని పేర్కొన్నారు చట్టబద్ధమైన నిబంధనలతో సమగ్ర చక్కెర, పునరుత్పాదక ఇంధన వ్యాపార నమూనాలో భాగంగా పనిచేస్తాయని వివరించారు. భారత ప్రభుత్వం పెట్రోల్‌తో ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడం, కలపడాన్ని చురుకుగా ప్రోత్సహిస్తోందని వివరించారు. ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ (ఇబిపి) కార్యక్రమం ద్వారా 20శాతం మిశ్రమాన్ని లక్ష్యంగా చేసుకుందని తెలిపారు. కంపెనీ పరిపాలన, నిర్వహణ ఎంతో పారదర్శకంగా ఉంటాయని, లాకౌట్ ప్రచారంలో కూడా వాస్తవ లేదని తెలిపారు.

జిల్లా జడ్జిని కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం.బబితను ఎస్‌పి వకుల్‌జిందాల్ శుక్రవారం కోర్టులోని తన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగి, నిందితులు శిక్షింపబడే విధంగా పోలీసు, న్యాయశాఖలు సమన్వయంతో పని చేయాలని సంకల్పించారు.

జడ్జి బబితకు పూలమొక్క అందజేస్తున్న ఎస్‌పి వకుల్

స్వచ్ఛాంధ్ర ఇతివృత్తాలు మార్పు

మేలో 'ఉష్ణతాపం నుంచి ఉపశమనం'.. జూన్‌లో 'నీరు - మీరు'

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సంబంధించి మే, జూన్ నెలల ఇతివృత్తాలను మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ప్రతి నెలా ఒక్కోఅంశం ఇతివృత్తంగా చేపడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తోంది. తాజాగా విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు మే నెలలో వేసవి నేపథ్యంలో మూడో శనివారం 'ఉష్ణతాపం నుంచి ఉపశమనం" అనే ఇతివృత్తంతోనూ, జూన్‌లో నీరు - మీరు అంశంపై ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలు ఈ మార్పులను గుర్తించి తదనుగుణంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

జ్యూట్‌మిల్లును యథావిధిగా తిప్పాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జ్యూట్ మిల్లును యథావిధిగా పని భారం లేకుండా తిప్పాలని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఇటీవల యాజమాన్యం మగ్గాలు లోడర్ ఫిట్టర్లను అదనంగా మగ్గాలు చూడాలని పనిభారం వేయడంతో కార్మికులతో శుక్రవారం స్థానిక జ్యూట్‌మిల్లు వద్ద గేటు మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరిలో జ్యూట్ యాజమాన్యం, లేబర్ కమిషనర్, జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్, రిజిస్ట్రేషన్ సంఘాలతో కలిసి యథావిధిగా మిల్లు తిప్పడానికి ఒప్పందం జరిగిందని గుర్తుచేశారు. ఇంతలో జ్యూట్ యాజమాన్యం పనిభారం వేయడం తగదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం యథావిధిగా తిప్పకపోతే కార్మికులు ఉద్యమించక తప్పదని హెచ్చరించారు.

వల్లంపూడి ఎస్‌ఐగా సుదర్శనరావు

ప్రజాశక్తి -వేపాడ

వల్లంపూడి పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా సుదర్శనరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కొత్తవలస నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తానని తెలిపారు. స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు న్యాయం చేకూర్చేలా విధులు నిర్వహిస్తామని తెలిపారు.

ఎస్ఐ సుదర్శనరావు

అక్రమ లేఅవుట్ క్రమబద్ధీకరణపై
అభ్యంతరాలు స్వీకరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మున్సిపాలిటీలోని మల్లమ్మపేట రెవెన్యూ సర్వే నెంబర్ 115/1ఎలో ఎకరా 42 సెంట్లలో అక్రమ లేఅవుట్ క్రమబద్ధీకరణపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి చెప్పారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ పత్రాలను మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ప్రదర్శించారు. ఆ లేవుట్ క్రమబద్ధీకరణ చేయాలని ఎల్ఆర్ఎస్‌లో దరఖాస్తు చేయగా ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిందని కమిషనర్ చెప్పారు. లేఅవుట్ క్రమబద్ధీకరణపై అభ్యంతరాలు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో 15 రోజుల్లో తెలపాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాఘవచార్యులు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

జడ్జి అరుణశ్రీని సన్మానిస్తున్న న్యాయవాదులు

సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీకి సన్మానం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి కోర్టులో పని చేసి, బదిలీపై వెళ్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు శుక్రవారం సన్మానించారు. జడ్జి అరుణశ్రీ సేవలను బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.మోహన్ మురళీ కుమార్, కార్యదర్శి కొల్లి సింహాచలం కొనియాడారు. కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు అమరాపు రామకృష్ణ, కె.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

ప్రజాశక్తి-వేపాడ

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంఇఒ పి.బాలభాస్కరరావు తెలిపారు. శుక్రవారం వల్లంపూడిలో ఉపాధి పని ప్రాంతానికి వెళ్లి, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. వల్లంపూడి ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చారని, ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుడు ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు పాల్గొన్నారు.

రామకృష్ణకు అవార్డు అందజేస్తున్న హెచ్ఒడి రత్నకుమారి

ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణకు అవార్డు

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కల్లేపల్లి రామకృష్ణ సర్టిఫికెట్ ఆఫ్ ఎక్స్‌లెంట్ అవార్డును అందుకున్నారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ రాష్ట్రంలోని కొన్ని ఆసుపత్రిల్లో హెచ్ఐవి రోగులకు నిరంతరం సేవలందిస్తున్న కొంతమంది సీనియర్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లను గుర్తించింది. దీనిలో భాగంగా రామకృష్ణ సేవలను గుర్తించి ఆంధ్ర మెడికల్ కళాశాలలో ఈ అవార్డును మైక్రోబయాలజీ హెచ్ఒడి రత్నకుమారి, శివ కళ్యాణి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ శిరీష, మెడికల్ అండ్ హెల్త్ అడిషనల్ ఆఫీసర్ పూర్ణేంద్రబాబు నుంచి అందుకున్నారు. అవార్డు అందుకున్న రామకృష్ణను సిహెచ్‌సి వైద్యాధికారి వెంకటరమణ, వైద్యులు, సిబ్బంది అభినందించారు.

తాగునీరు వృథా

విజయనగరం టౌన్ : కలెక్టరేట్ వెనుక వైపు మున్సిపల్ కుళాయి పైప్‌లైన్ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా పోతుంది. గొయ్యిపడి అనేక రోజులు అవుతున్నా అధికారులు గాని, నగర పాలక సంస్థ ఉద్యోగులు గాని పట్టించుకోలేదు. దీంతో కుళాయిలు వస్తే చిన్న చెరువును తలపించే విధంగా నీరు రోడ్డుపై ఉంటోంది. అసలే వేసవి.. నీరు లేక నగరంలో ప్రజలు అల్లాడి పోతున్నారు. ఈనేపథ్యంలో లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

27న ఆంగ్ల ఉపాధ్యాయులకు శిక్షణ

బొబ్బిలి : ఆంగ్ల ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి వృత్యంతర శిక్షణను ఈ నెల 27న స్థానిక ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డెల్టా అధ్యక్షులు ఎం.విజయ మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం డెల్టా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శిక్షణకు పరిశీలకులుగా రాష్ట్ర, జిల్లా ఉన్నత విద్యా శాఖాధికారులు హాజరవుతున్నారని చెప్పారు. ఆంగ్ల భాష బోధనలో ఉపాధ్యాయులకు క్లిష్టతరమైన 14 ఇంగ్లీష్ బోధనాంశాలపై ప్రత్యక్ష శిక్షణ ఉంటుందని తెలిపారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్స్ కె.సత్యనారాయణ, బి.పరమేశ్వర్, ఎస్.శ్రీనివాస్, సిహెచ్.రాంబాబు పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి కల్పించండి

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుర్ల

గ్రామాల్లో వేతనదారులకు ఉపాధిహామీ పనులు కల్పించాలని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి పొట్నూరు ప్రమీల అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సమీక్షించి అధికారుల పనితీరుపై ఆరాతీశారు. గత ప్రభుత్వంలో 100 రోజులు ఉపాధి కల్పనతో ప్రతీ వేతనదారుడికి గిట్టుబాటు కూలి లభించేదని ఆయన తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వంలో రూ.307 కూలి కల్పిస్తున్నామంటూ ప్రకటించినా ఏ ఒక్కరికీ రూ.100 లేదా 150 కంటే మించడం లేదన్నారు. ప్రస్తుతానికి 50 మందికి ఒక మేట్ నియమించడానికి అవకాశం ఉందని, కానీ పాత మేట్లను ఎందుకు తొలగిస్తున్నారని ఉపాధి హామీ అధికారులను ప్రశ్నించారు. గ్రామాల వారీగా పెండింగ్ పనులను ఉపాధి హామీ కింద పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. బుర్లెపేట గ్రామానికి తాగునీటి సమస్య ఉందని ఎంపిటిసి జోగినాయుడు సభ దృష్టికి తీసుకెళ్లారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని చైర్మన్ ఆదేశించారు. ఉపాధి హామీ ఎపిఒ తీరుపై సర్పంచులు సభ దృష్టికి తెచ్చారు. ప్రజాప్రతినిధులకు కనీసం సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్‌పిటిసి అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు అంబల్ల లక్ష్మి, తోట తిరుపతిరావు, ఎంపిడిఒ శేషుబాబు, ఉపతహశీల్దార్ నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సంతకవిటి

గ్రామాల అభివద్దే కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే కోండ్రు మురళిమోహన్ అన్నారు. శుక్రవారం సంతకవిటి మండలంలోని బూరాడ పేట, మంతెన, కొండగూడెం, ఎం.ఆర్ ఆగ్రహం తదితర గ్రామాల రహదారులకు 2.18 కోట్లు రూపాయల నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో రోడ్లను గాలికివదలిలేయడంతో మరమ్మత్తుకు నోచుకోక అస్తవ్యస్తంగా తయారయ్యాయని అన్నారు. కూటమి ప్రభుత్వం మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూ.9కోట్లు నిధులు మంజూరు చేసి, అభివృద్ధికి శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం సంతకవిటి ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లోవినతులు స్వీకరించారు. వినతులలో ఎక్కువగా రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, పెన్షన్లు, రెవిన్యూ సమస్యలపై వచ్చాయని, త్వరలో పరిష్కారం చేస్తామని తెలిపారు. అనంతరం రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల బ్రోచర్, కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ మేరకు కళాశాల వసతులు, విద్యా, నైపుణ్య ప్రమాణాలు, సదుపాయాల గూర్చి విస్తతంగా అవగాహన కల్పించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్న హైందవికి సూచించారు.

అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

కార్పొరేట్ కళాశాలలు ధీటుగా రాజాం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఫలితాలు తీసుకురావాలన్నారు. విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ సురేష్ కుమార్, కోండ్రు జగదీష్, తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, ఎంపిటిసి వల్లూరు గణేష్, గురవనా నారాయణరావు, గట్టి భాను, మన్నేన రమేష్, బవిరి శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తారు... దర్యాప్తునకు సహకరించరు

ఇది అలజంగి పొదుపు సంఘాల సభ్యుల, పెద్దల నిర్వాకం

దర్యాప్తునకు హాజరైన అధికారులు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలోని అలజంగిలోని 108 పొదుపు సంఘాల్లో విఒఎ అక్రమాలకు పాల్పడ్డారని గత 8 నెలలుగా గ్రామానికి చెందిన కొన్ని పొదుపు సంఘాల మహిళలు, కొంతమంది పెద్దలు డిఆర్‌డిఎ పీడీకి, ఇటీవల ఎమ్మెల్యే బేబినాయనకు ఫిర్యాదులు చేశారు. దీనికి స్పందించిన పీడీ పలుమార్లు విజయనగరం నుంచి సిబ్బందిని పంపించి దర్యాప్తు నిర్వహించాలని ఆదేశించారు. ఈ క్రమంలో అలజంగి గ్రామానికి శుక్రవారం విజయనగరం నుంచి విచారణ అధికారులు వచ్చారు. దర్యాప్తునకు సిబ్బంది వస్తారని గురువారం రాత్రి దండోరా కూడా వేయించారు. అయినా సరే శుక్రవారం చేపట్టిన దర్యాప్తునకు ఫిర్యాదు చేసిన పెద్ద మనుషులు గాని , పొదుపు సంఘాల సభ్యులు గాని రాలేదు. రాకపోవడంతో చేసేది లేక సాయంత్రం 5.30 వరకు గ్రామంలో ఉండి వచ్చిన ఒకటి రెండు సంఘాలతో దర్యాప్తు నిర్వహించామని, మళ్లీ సోమవారం దర్యాప్తు చేస్తామని ఎపిఎం పి.భాగ్యలక్ష్మి తెలిపారు.

ఈ విషయమై ఎపిఎం భాగ్యలక్ష్మి వివరణ కోరగా గ్రామంలో విఒఎ అక్రమాలకు పాల్పడినట్లు అస్పష్ట ఫిర్యాదులు అందాయని, అయినప్పటికీ మీడియా కథనాలకు, ఎమ్మెల్యే అదేశానుసారం పలుమార్లు దర్యాప్తునకు గ్రామానికి వచ్చామని తెలిపారు. అయినా ఫిర్యాదుదారులు సహకరించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి ఎస్.కోట మేనేజర్ కె.రమణ, ఎఫ్‌పిఒ ఎపిఎం పి.సత్యనారాయణ, ఎల్‌సి ఎపిఎం జి.దేవుడుబాబు, పి.దుర్గాప్రసాద్, కె.భాస్కర్, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ, కొత్తవలస.. ర్యాలీలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు

మలేరియాపై అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి-గంట్యాడ

ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం గంట్యాడలో వైద్యాధికారి హేమలత ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఇ ఎర్రన్న, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస : వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యాన విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. ముసిరాంలో ఉపాధి కూలీలకు హెల్త్ అసిస్టెంట్ సత్యారావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి ఇఒ నరసింహారావు, పిహెచ్ఎన్ జగదాంబ, హెచ్‌వి పద్మావతి, హెచ్ఎస్ ఈశ్వరరావు, ఫార్మసీ ఆఫీసర్ ఆశాజ్యోతి, స్టాఫ్‌నర్స్ భాగ్య, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి కె.అజయ్‌కుమార్ ఆధ్వర్యాన ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం నిర్వహించారు. కెజిపూడి సచివాలయ పరిధిలో బొద్దాం పిహెచ్‌సి వైద్యాధికారి పి.శివానీ ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి బి.శ్రీనివాస్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ పిఎస్ఆర్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు

లక్కవరపుకోట : లక్కవరపుకోటలో ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి బి.అనిల్ కుమార్ ఆధ్వర్యాన సిబ్బంది మలేరియాపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో మలిచర్ల సర్పంచ్, వైస్ ఎంపిపి చేరిక

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం మండలం మలిచర్ల గ్రామానికి చెందిన వైసిపి సర్పంచ్ తుమ్మగంటి రమాకుమారి , వైస్ ఎంపిపి కొసర నిర్మల (ఎంపిటిసి), వైస్ సర్పంచ్ తుమ్మగంటి చిరంజీవి మాజీ సర్పంచ్ తుమ్మగంటి అప్పన్నతాత , వైసిపి మండల యువత అధ్యక్షులు తుమ్మగంటి సురేష్, నాయకులు తుమ్మగంటి రామారావు, కొసర శివతో పాటు వార్డు మెంబర్లు శుక్రవారం టిడిపిలో చేరారు. పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు సమక్షంలో సుమారు 6వందల కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పాల్గొన్నారు.

రమణకు ఆర్థిక సహాయం

గుంకలాం గ్రామానికి చెందిన కెల్ల రమణ అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకున్నారు. వారి ఆర్థికపరిస్థితి బాగోలేనందున ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.3లక్షలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న క్యూసి అధికారులు

రోడ్డు నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆతవ జంక్షన్ నుంచి ఆ గ్రామానికి నిర్మించిన బిటి రోడ్డు నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.1.35 కోట్లతో సుమారు రెండు కిలోమీటర్ల మేర ఈ రహదారిని నిర్మించారు. కార్యక్రమంలో క్వాలిటీకంట్రోల్ ఇఇ ప్రదీప్‌కుమార్, డిఇ యు.సోములు, జెఇ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డిఇ సత్యనారాయణ మూర్తి, మానస పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బాలిక అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-డెంకాడ

మండల కేంద్రం డెంకాడకు చెందిన బాలిక విశాఖపట్నంలోని జ్ఞానాపురం చర్చిలో అనుమానాస్పద స్థితిలో మరణించింది. గురువారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం ప్రకారం... డెంకాడకు చెందిన ఈదల పూర్ణ చంద్రకళ (11) తల్లి భర్త, అత్తతో గొడవడి, గ్రామంలోని బిసి కాలనీలో నివాసముంటోంది. చంద్రకళకు ఐదు రోజుల క్రితం మసూచి సోకింది. దీంతో బాలికను తల్లి, అమ్మమ్మ కలిసి విశాఖపట్నంలోని జ్ఞానాపురం చర్చికి గురువారం తీసుకెళ్లారు. అక్కడ బాలిక మతిస్థిమితం లేకుండా కేకలు వేయడంతో నోటికి గుడ్డ కట్టి పడుకోబెట్టారు. దీంతో బాలిక ఊపిరాడక మరణించిందని గ్రామస్తులు చెబుతున్నారు. తల్లి, అమ్మమ్మ కలిసి చంపేశారని మరికొందరు ఆరోపిస్తున్నారు. చంద్రకళ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. ఈ ఘటనపై విశాఖపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు.

మృతిచెందిన చంద్రకళ

పాముకాటుతో వికలాంగుడు మృతి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కొత్తపేటలో పాము కాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. కొత్తపేటకు చెందిన అట్టాడ పూడినాయుడు (38) అనే వికలాంగుడు శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో తన ఇంటి డాబా మీదికి వెళ్తుండగా పాము కరిచింది. బాధితుడికి స్థానికంగా సపర్యాలు చేసి, జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పూడినాయుడు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పూడినాయుడు (ఫైల్)

రొమ్ములు కోసేయడంతో మృతిచెందిన ఆవు

మూగజీవిపై కర్కశం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

వ్యక్తుల మధ్య మనస్పర్థలతో మూగజీవంపై కర్కశం చూపించిన సంఘటన మండలంలోని కుమిలి గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు చందక రమణ కథనం ప్రకారం... చందక రమణ ఎప్పటిలాగే గురువారం రాత్రి తన ఆవును ఇంటి వద్ద కట్టుకొని నిద్రించారు. తెల్లవారేసరికి ఆవు విగతజీవిగా పడి ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు ఆవు రొమ్ములను కోసేసి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉపాధి వేతనం పెరగాలి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-రాజాం

ఉపాధి వేతనదారులకు అత్యధిక వేతనం వచ్చేలా పనులు చేయించాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. రాజాం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులపై ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పనుల తీరు, వేతనదారులు అందుకుంటున్న సగటు వేతనంపై సమీక్షించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎండ తీవ్రత లేని సమయంలో పనులు నిర్వహించాలని చెప్పారు. ఉదయాన్నే వీలైనంత వేగంగా పని మొదలయ్యేలా చూడాలన్నారు. రెండుపూటలా పనులు చేయించాలని ఆదేశించారు. వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని, తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలని సూచించారు. వేతనదారులు రోజుకి రూ.307 వరకు అందుకొనే అవకాశం ఉందని, పనిని పెంచి గరిష్ట వేతనం అందుకునేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ ఎస్.శారదాదేవి, ఆర్‌డిఒ సత్యవాణి, ఎంపిడిఒలు, ఎపిఒలు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు తక్షణ పరిష్కారం

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశకి-విజయనగరం టౌన్

పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్, బిపిఎస్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని ప్రణాళికా సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ఆర్ఎస్, బిపిఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం మరో 3నెలలు గడువు పొడిగించిందన్నారు. వ్యక్తిగత దరఖాస్తులను కూడా తక్షణమే పరిష్కరించేందుకు అవసరమైన చొరవ చూపాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను తమ దృష్టికి తెచ్చినట్లయితే అవి పరిష్కారమయ్యే విధంగా చూస్తామన్నారు. నగరంలో అనధికార ఫ్లెక్స్ బోర్డులు ఉండరాదన్నారు. పోస్టర్లు లేకుండా చూడాలన్నారు. అనధికార ప్రకటన బోర్డులు గుర్తించి అపరాధ రుసుములను విధించాలని స్పష్టం చేశారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టిపిఒ అప్పలరాజు, టిపిఎస్ అనిత పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి లో పర్యటించిన కమిషనర్

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా రింగ్‌రోడ్డు ప్రాంతం, అలకానంద కాలనీ ప్రాంతాల్లో కమిషనర్ నల్లనయ్య పర్యటించారు. ముందుగా రింగ్ రోడ్ లో ఉన్న గార్బేజ్ ట్రాన్సిట్ స్టేషన్ కు చేరుకుని చెత్త తరలించే విధానాన్ని గమనించారు. నిర్ణీత సమయానికి చెత్త తరలించే వాహనాలు (క్లాప్ వెహికల్స్) వస్తున్నాయా లేదా అన్న విషయమై ఆరా తీశారు. అనంతరం సమీపంలో నిర్మితం కానున్న విద్యుత్ సబ్ స్టేషన్ మార్కింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఆ తర్వాత 39 వ డివిజన్ కి వెళ్లి అక్కడ ఉన్న 47వ నెంబర్ సచివాలయాన్ని సందర్శించారు. కార్యదర్శుల హాజరు పట్టీ, రికార్డుల నిర్వహణ, అందిస్తున్న పౌర సేవలు వంటి ప్రక్రియలను పరిశీలించారు. సకాలంలో విధులకు హాజరుకావాలని, ఇలాంటివి పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో ఉన్న అన్నా క్యాంటీన్ ను పరిశీలించారు.

పోలీసు డాగ్ కెన్నెల్స్ నిర్మాణం పూర్తికి చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పోలీసుశాఖలో నేర నియంత్రణ, ఛేధనలో విశేషంగా పని చేస్తున్న పోలీసు డాగ్స్‌విశ్రాంతి తీసుకొనేందుకు నిర్మాణంలో ఉన్న డాగ్ కెన్నెల్స్ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఎఆర్ పోలీసు లైన్స్‌లో గతంలో నిర్మించి, సగంలో నిలిచిపోయిన డాగ్ కెన్నెల్స్‌ను ఎస్‌పి శుక్రవారం పరిశీలించారు. పోలీసు డాగ్స్ విశ్రాంతి తీసుకొనేందుకు ప్రత్యేకంగా శాశ్వతమైన కెన్నెల్స్ లేకపోవడంతో ఇక్కడ తాత్కాలిక కెన్నెల్స్ వినియోగిస్తున్నామన్నారు. ప్రస్తుతం పోలీసు డాగ్స్ విశ్రాంతి తీసుకొనేందుకు ఎటువంటి ఇబ్బంది లేనప్పటికీ భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పోలీసు డాగ్స్ కోసం ప్రత్యేకంగా కెన్నెల్స్ నిర్మాణం చేయాల్సి ఉందన్నారు కొన్ని అనివార్య కారణాలు వలన గతంలో నిర్మించి, సగంలో నిలిచిపోయిన కెన్నెల్స్ నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. కెన్నెల్స్ నిర్మాణం, ఆఫీసు రూం, డాగ్స్కు ఫుడ్ ప్రిపేర్ చేసేందుకు ప్రత్యేకంగా కిచెన్ ఉండే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌పి వెంట ఎస్‌బి సిఐ ఎవి లీలారావు, సెక్యూరిటీ రిజర్వు ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనివాసరావు, డాగ్ హ్యాండలర్స్ ఉన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

పోలీసు సిబ్బంది సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, చర్యలు చేపడతామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. వారి వ్యక్తిగత, వత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, బదిలీలు, మ్యూచువల్ బదిలీలకు వినతులు స్వీకరించారు.

పందుల పెంపకం కేంద్రాలు నిర్వహించొద్దు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగర పరిధిలో ఎక్కడా పందుల పెంపక కేంద్రాలు నిర్వహించరాదని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పందుల పెంపకం దారులకు నిర్దేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పందుల పెంపకందారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం నగర పరిధికి వెలుపల 3 నుండి 5 కిలోమీటర్ల దూరంలో పందుల పెంపక కేంద్రాలు నిర్వహించుకోవాలని తెలిపారు. ఇందుకోసం నగర పరిధికి వెలుపల నిర్దేశిత స్థలాన్ని గుర్తించి రెవెన్యూ విభాగానికి నివేదించేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఇందుకు ముందస్తుగా నగరంలో ఎంతమంది పందుల పెంపకందారులు ఉన్నారు, వారి వద్ద ఎన్ని పందులు ఉన్నాయన్న విషయాన్ని సేకరించామన్నారు. నగరంలో మొత్తం 60 మంది వరకు పందుల పెంపకందారుల కుటుంబాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఏ ఒక్కరూ నగర పరిధిలో పందులను పెంచకూడదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పందులను పెంచినట్లు గుర్తిస్తే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డా. కొండపల్లి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో డిఎంహెచ్ఒ తనిఖీలు

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ ఎస్.జీవనరాణి శుక్రవారం తనిఖీలు చేపట్టారు. పిహెచ్‌సిలో నిర్వహిస్తున్న డెలివరీలు, ల్యాబ్ పరీక్షలు, వ్యాక్సిన్, ఒపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె సిబ్బందితో మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు శతశాతం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిసి రాజు, డాక్టర్ అజయ్ కుమార్, సిహెచ్ఒ ఆంజనేయులు, ఎస్ఎ కె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జీవనరాణి

లక్కవరపుకోట : లక్కవరపుకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఒ జీవనరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్, ప్రసూతి గది, ఒపి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆమె సూచించారు.

సిఆర్‌టిలకు ఉద్యోగభద్రత కల్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గిరిజన సంక్షేమశాఖ ఆధ్యర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్‌టిలకు ఉద్యగ భద్రత కల్పించాలని గిరిజన శాఖ అడిషనల్ డైరెక్టర్‌కు అమరావతి ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు శుక్రవారం వినతి అందజేశారు. సోషల్ వెల్ఫేర్ ఆధ్యర్యంలో నడుస్తున్న గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న టిజిటి, పిజిటిలు డిఎస్‌సి వల్ల నష్టపోకుండా చూడాలని, వారి వేతనాలను పెంచాలని కోరారు.

27న బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక

విజయనగరం టౌన్ : మే 2 నుంచి 4 వరకు కాకినాడలో జరిగే అంతర జిల్లాల బీచ్ కబడ్డీ పోటీలలో పాల్గొనబోయే విజయనగరం జిల్లా స్త్రీ, పురుషుల కబడ్డీ జట్లు ఎంపిక ఈనెల 27న ఉదయం 7 గంటలకు సారిపల్లి గ్రామంలో నిర్వహిస్తామని అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఐవిపి రాజు, అధ్యక్ష కార్యదర్శులు రంగారావు దొర, ప్రభావతి తెలిపారు. వివరాలకు 9949721949 సంప్రదించాలని కోరారు.

NAME CHANGE

I, Damera Krishna babu s/o (late) Jaganath Rao. previously called Damera Krishna Rao, Resident at 44-73 College Road, Maharajupeta, Bobbili - 535558, Vijayanagaram (Dt) Now changed my name from Damera Krishna Rao to **Damera Krishna Babu** for all purpose.